క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్‌కు ఆత్మీయ స్వాగతం



సాక్షి, పాడేరు: పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు నియోజకవర్గం మెంటాడ మండలం చిన్నమేడపల్లిలో శుక్రవారం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లను మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు.

సెల్ టవర్ పనులకు శంకుస్థాపన

హుకుంపేట: మండలంలోని దిగుడుపుట్టులో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణ పనులకు సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన మారుమూల గ్రామల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, శివారు గ్రామాల్లో సైతం సెల్ టవర్లు నిర్మాణాలు చేపడుతుందన్నారు. గ్రామల్లో సిగ్నల్ లేకపోవడంతో గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కోనేవారని, సమస్య పరిష్కారానికి ప్రభుత్వం గ్రామల్లో సెల్ టవర్లు మంజురు చేస్తోందన్నారు. సచివాలయం కన్వీనర్లు అనిల్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు భూమిపూజ

అడ్డతీగల: అడ్డతీగల మండలంలో శనివారం పలు అభివృద్ధి పనులకు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు భూమిపూజ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎల్లవరంలోని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. డి.రామవరం సెంటర్ నుంచి తుంగమడుగుల, డి.రామవరం నుంచి దుశ్చర్తి, దుశ్చర్తి నుంచి డి.పోలవరప్పాడు ప్రాంతాలలో రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసి, ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం డి.రామవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

నేడు మండల సమావేశం

అనంతగిరి: మండల కేంద్రంలోని శనివారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షత జరుగుతుందని ఎంపీడీవో కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు జరగనున్న సమావేశంలో మండలంలోని జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చిస్తారని, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొవాలని కోరారు. అధికారులంతా అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

పాముగండి సర్పంచ్ బుచ్చన్నదొర మృతి



బుచ్చన్నదొర (ఫైల్)

దేవీపట్నం: పాముగండి పంచాయతీ సర్పంచ్ కోసు బుచ్చన్నదొర (36) అనారోగ్యంతో మృతి చెందారు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంపీపీ కుంజం మురళీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబ్జి, మురళీ, లక్ష్మణ్, శ్రీనివాస్, సర్పంచ్‌లు ఎంపీటీసీ లు బుచ్చన్నదొర మృతిదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బుచ్చన్నదొర ఎనలేని సేవలందించారని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని నాయకులు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి దిబ్బపాలెం విద్యార్థి

అనకాపల్లిటౌన్: మండలంలోని దిబ్బపాలెం హైస్కూల్ నుంచి 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థి సిరసపల్లి యోగేంద్ర ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. ఈ మేరకు యోగేంద్రను శుక్రవారం గ్రామ ఎంపీటీసీ పి.అచ్చియ్యమ్మ, హెచ్ఎం జి.ఉమామహేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ యల్లపు రామచంద్రరావు, కమిటీ సభ్యులు అభినందించారు. బాగా చదివి, ఉన్నత స్థానంలో నిలవాలని ఆభిలషించారు.

వరలక్ష్మీ.. నమోస్తుతే

- భక్తిశ్రద్ధలతో వరాల తల్లికి పూజలు
- భక్తులతో కళకళలాడిన ఆలయాలు
- ఇంటింటా ఆధ్యాత్మిక శోభ

ముంచంగిపుట్టు/జి.మాడుగుల/చింతపల్లి రూరల్/రాజవొమ్మంగి/అడ్డతీగల: శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో మహిళలంతా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. గృహాలను మామిడితోరణాలు, పుష్పాలతో అలంకరించారు. అమ్మవారి కలశాన్ని పీఠంపై ప్రతిష్ఠించి పసుపు, కుంకుమ, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించారు. పండ్లు, వివిధ రకాల పిండి వంటకాలను నివేదించారు. కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఇంటికి ముత్తయిదువులను ఆహ్వానించి వాయినాలు అందజేశారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు జరిపించారు. తీర్థ ప్రసాద వితరణ జరిగింది. అడ్డతీగల మండలంలోని పవనగిరి క్షేత్రంలో కొలువైన గిరి దుర్గా భవానీ అమ్మవారి ఆలయంలో నెలకొల్పిన వరలక్ష్మి అమ్మవారికి లక్ష్మీ అష్టోత్తర అష్టలక్ష్మి ధ్యాన శ్లోకాలతో శ్రీ సూక్తం ఖడ్గమాలతో అమ్మవార్లకు కుంకుమ పూజ జరిపారు. ఆలయాలన్నీ భక్తులతో కళకళలాడాయి. గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.



ముంచంగిపుట్టులో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు



పాడేరు మోదకొండమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పాడేరులో భక్తులకు ప్రసాద వితరణ



అమ్మవారికి భక్తులు సమర్పించిన నైవేద్యం



పవనగిరి క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి సమస్యలు

అనంతగిరి: ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకర రావును, ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మిని, రాష్ట్ర గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు, శుక్రవారం విజయనగరంలోని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏజెన్సీలోని పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, పీఈటీ, పండిట్‌లను అప్‌గ్రేడ్ చేయాలని, సీనియర్ హెచ్ఎంల ద్వారా డీఈవో పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు సూర్యనారాయణ, శేషగిరిరావు, సుబ్బారావు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావును సన్మానిస్తున్న గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నేతలు

నేడు విత్తనాల పంపిణీ

పెదబయలు: మండలంలోని అడుగులపుట్టు రైతు భరోసా కేంద్రంలో శనివారం ఉదయం 10.30 గంటలకు రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేయనున్నట్టు మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మండల నాయకులు చేతుల మీదుగా 90 శాతం సబ్సిడీపై విత్తనాలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. అడుగులపుట్టు గ్రామ సచివాలయం పరిధిలోని రైతులకు అందించిన తరువాత ఇతర పంచాయతీల వారికి విత్తనాలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తులు

జి.మాడుగుల: నేషనల్ మీన్స్-కం- మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు డి.దేవానందరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 3న రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని పాఠశాలల్లో 8వతరగతి చదువుతూ కుటుంబ ఆధాయం రూ.3.50 లక్షలు ఉన్న విద్యార్థులు అర్హులని తెలిపారు. పరీక్ష రుసుం జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్టీ, ఎస్సీ విద్యార్థులు రూ.50 చెల్లించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ సెప్టెంబర్15. పరీక్ష రుసుం చెల్లించేందుకు ఆఖరి తేదీ సెప్టెంబర్16 అని పేర్కొన్నారు. ప్రింటెడ్, నామినల్ రోల్స్ ధ్రువీకరణ పత్రాలు సంబంధిత జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించేందుకు చివరి తేది సెప్టెంబర్19 అని ఆయన తెలిపారు.మరిన్ని వివరాలకు జిల్లా విద్యా శాఖాధికారి కార్యాయలంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కొమ్మంగిలో నిలిచిన సెల్ సేవలు

చింతపల్లి: మండలంలోని కొమ్మంగిలో గత కొద్ది రోజులుగా సెల్ సేవలు నిలిచిపోయాయి. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొమ్మంగిలో బీఎస్ఎన్ఎల్ టవర్ ద్వారా దాదాపు 10 గ్రామాలకు సంకేతాలు అందుతున్నాయి. అయితే కొమ్మంగి గ్రామంలో రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా కాలువలు తవ్వడంతో కేబుల్ వైర్ తెగిపోయింది. దీంతో సంకేతాలు పది రోజులుగా నిలిచిపోయాయి. దీంతో వినియోగదారాలు సంకేతాల కోసం ఇతర ప్రాంతాల నెట్‌వర్క్ పరిధిలోకి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలపై వినతి

పెదబయలు: జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న పలు సమస్యలపై ఐటీడీఏ పీవో అభిషేక్‌కు జెడ్పీటీస సభ్యుడు కూడా బొంజుబాబు, నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో డిప్యూటీ వార్డెన్లు, హెచ్‌డబ్ల్యూవోల నియామకం నిబంధనల ప్రకారం చేయాలని కోరారు.ఎస్‌జీటీ, పీడీ, పీఈటీలకు డిప్యూటీ వార్డెన్, హెచ్‌డబ్ల్యూవోలుగా అదనపు బాధ్యతలు అప్పగించాలని, మెరుగైన బోధన అందించాలని వినతిలో పేర్కొన్నారు. దీనిపై పీవో సానుకూలంగా స్పందించినట్టు జెడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు చెప్పారు. నాయకులు రాధాకృష్ణ తదితరులున్నారు.



పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌కు వినతిపత్రం అందిస్తున్న జెడ్పీటీసీ బొంజుబాబు తదితరులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.మాడుగుల: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పాడేరు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. జి.మాడుగుల మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రెండు మండలాల్లో రేపు..

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు, పెదబయలు రెండు మండలాల్లో ఈనెల 27న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ ఎ.వి.ఎ స్.అప్పారావు ప్రకటనలో తెలియజేశారు. 33 కెవి విద్యుత్ లైన్లు మరమ్మతుల నిమిత్తం ఆ ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, ఆయా మండలాలల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

డ్రాపౌట్స్ విద్యార్థుల గుర్తింపునకు ప్రత్యేక చర్యలు



పెదబయలులో మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణయ్య, ఎంఈవో కృష్ణమూర్తి, పుష్ప



రాజవొమ్మంగి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, ఎంఈఓలు

పెదబయలు: మండలంలో డ్రాపౌట్ విద్యార్థులకు గుర్తించాలని ఎంపీడీవో పూర్ణయ్య అన్నారు.కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక స్కూల్ కాంప్లెక్స్‌లో ఎంఈవో, ఏటీడబ్ల్యూవో, వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లతో శుక్రవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలోని అన్ని గ్రామాల్లో 5 నుంచి 18 ఏళ్లలోగా పిల్లలను ఇంటింటా వెళ్లి మూడు రోజుల్లో సర్వే నిర్వహించాలని, అలాగే ప్రతీ పాఠశాలలో ఉన్న డ్రాపౌట్ విద్యార్థులు, లాంగ్ ఆప్‌సెంట్లు, బడికి ప్రవేశం కాని విద్యార్థులకు గుర్తించాలని వెల్ఫేర్ అసిస్టెంట్‌తో పాటు వలంటీరు సర్వే పట్టికలో పొందపర్చాలన్నారు. తల్లితండ్రులతో మాట్లాడి తిరిగి పాఠశాలకు చేర్పించాలని, మూడు రోజుల్లో సర్వే పూర్తి చేసి వారం రోజుల్లో విద్యార్థులను చేర్పించాలని సూచించారు. ఈ మేరకు పంచాయతీ పరిధిలో ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని కోరారు.ఎంఈవోలు కృష్ణమూర్తి, పుష్ప, ఏటీడబ్ల్యూవో స్వర్ణలత వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: బడి బయటి పిల్లలను (డ్రాప్టౌ) తిరిగి చేర్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రాజవొమ్మంగి ఎంపీడీఓ యాదగిరీశ్వరావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం హాలులో వెల్‌ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వలంటీర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి బడి మానేసి ఇళ్ళ వద్దనే ఉంటున్న వారిని గుర్తించాలని సూచించారు. పిల్లలు తిరిగి పాఠశాలకు వెళ్లేలా వారిని చైతన్య పరచాలని సూచించారు. బడి బయటి పిల్లలపై సమగ్ర సర్వే చేపట్టాలన్నారు. విద్యాలయం నుంచి దీర్ఘకాలంగా గైర్హాజర్‌లో వున్న పిల్లల పేర్లు సేకరించాలని ఆదేశించారు. మండలంలో గల 270 మంది సచివాలయ వలంటీర్లు బడి బయటి పిల్లలను గుర్తించే బాధ్యతను తీసుకోవాలని ఎంఈఓ -2 సూరారెడ్డి కోరారు. ఎంఈఓ-1 అబ్బాయిదొర తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న చెట్టి వికాష్, సర్పంచ్ సురేష్‌కుమార్

పెదబయలు: మండలంలోని మారుమూల రూడకోట పంచాయతీ పెదలోవ గ్రామానికి చెందిన ముక్కి కృష్ణారావు(26) ఈ నెల 24న విశాఖలో ఉంటున్న ఇంట్లో వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. కృష్ణారావు విశాఖపట్నంలో ఓ షాపింగ్ మాల్‌లో ఉద్యోగం చేస్తూ ఉండేవాడు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు పోస్టు మార్టమ్‌కు తరలించారు. విషయాన్ని తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు మన్య ప్రగతి చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ చెట్టి వినయ్, పెదబయలు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, రూడకోట సర్పంచ్ కాతారి సురేష్‌కుమార్ తదితరులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖర్చుల నిమిత్తం రూ.5000 వేలు చొప్పున రూ.10 వేలు కుటుంబ సభ్యులకు అందించి ఓదార్చారు. అలాగే అధికారులతో మాట్లాడి అంబులెన్స్‌లో కృష్ణారావు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. సకాలంలో కష్టాల్లో ఉన్న వారిని స్పందించిన అరకు ఎమ్మెల్యే, ఇతర నాయకులకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

అట్టహాసంగా ఓనం వేడుకలు

సబ్బవరం: ఇండియన్ మారీ టైం విశ్వవిద్యాలయంలో వరలక్ష్మీవ్రతం,ఓనం పర్వదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ డైరెక్టర్ వీకే కేశవదేవ్ ఓనం ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. సిరిసంపదలను తీసుకువచ్చే ఎంతో సంతోషమైన రోజు అని తెలిపారు. పండగను పురస్కరించుకొని వర్సిటీలో రంగవల్లులతో అలంకరించి,జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక పోటీల్లో భాగంగా విద్యార్థుల సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి డైరెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సాంప్రదాయ వంటలతో ఏర్పాటు చేసిన విందు భోజనాలతో కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో హెచ్వోడీ ఎస్. జనార్దనన్,అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయి చరణ్, జె. రాజు, ప్రొఫెసర్స్ శ్రీ పద్మ, ఎం. ప్రేమ్ చంద్,జి. అవినాష్, ఎ. కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు

వరి నాట్లు ముమ్మరం

కోటవురట్ల: ఖరీఫ్ వరి నాట్లు చివరి దశకు చేరుకున్నాయి. మండలంలో వరి నాట్లు ఇప్పటికే దాదాపు 70 శాతం పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల పూర్తి చేసేందుకు చురుగ్గా వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కొడవటిపూడి, పాములవాక, చినబొడ్డేపల్లి, పి.కె.పల్లి, ఆక్సాహేబుపేట, కె.వెంకటాపురం, తిమ్మాపురం, లింగాపురం, జల్లూరు, యండపల్లి, కైలాసపట్నం, రాజుపేట ప్రాంతాలలో వరినాట్లు పడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు 1680 హెక్టార్లు లక్ష్యంగా వ్యవసాయాధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



పీఆర్‌టీయూ నూతన కార్యవర్గ సభ్యులు

దుంబ్రిగుడ: మండలంలోని పీఆర్‌టీయూ నూతన కార్యవర్గ ఎన్నిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పలరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా కె లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా రాంప్రసాద్, అసోషియేట్ అధ్యక్షుడిగా శెట్టి రాజు, ఉపాధ్యక్షుడిగా మధుసుధన్‌రావు, గౌరవ అధ్యక్షుడిగా శెట్టి మహలక్ష్మి,కోశాధికారిగా సింహాద్రి, ప్రచార కార్యదర్శిగా రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎం.భీమవరంలో వైద్య శిబిరం



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొయ్యూరు: మండలంలోని ఎం.భీమవరం సచివాలయంలో శుక్రవారం యూ.చీడిపాలెం వైద్యుడు జయప్రకాశ్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలతో పాటు మలేరియా పరీక్షలు చేశారు. ఆరోగ్య పరీక్షల్లో ఎవరికీ మలేరియా లేనట్టు నిర్దారణ అయినట్టు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మరగబెట్టిన నీటిని తాగాలని సూచించారు. దోమల నివారణకు తీసుకోవలసిన చర్యలను ఆయన వివరించారు. ఏఎన్ఎంలు, హెల్త్‌అసిస్టెంట్లు, ల్యాబ్‌టెక్నీషియన్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

రాయితీపై విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ రూతు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ జ్యోతి,నాయకులు బాలరాజు

అనంతగిరి: మండల కేంద్రంలోని సచివాలయం వద్ద గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలను ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ సర్పంచ్ రూతు, జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నీలవేని మాట్లడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ దీపిక, వలంటీర్లు బాక సునీత, మాణిక్యం, సునీత, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మాడగడ పంచాయతీ కేంద్రంలోని ఆర్‌బీకేలో సర్పంచ్ ఎం.జ్యోతి రైతులకు రాజ్‌మా విత్తనాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తూ ఎంతో మేలు చేస్తోందన్నారు.నాయకులు బాలరాజు, పైడన్న, భవాని, లక్ష్మణ్, హిందు, సచివాలయం కార్యదర్శి చిట్టిబాబు, సిబ్బంది రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్య రక్షణ



గలగండలో ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తున్న వైద్యాధికారి రమేష్, సిబ్బంది

ముంచంగిపుట్టు: వ్యక్తగత శుభ్రతతో పాటు గ్రామాల్లో పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని కిలగాడ వైద్యాధికారి ఎస్.రమేష్ అన్నారు. మండలంలో గల పెదగూడ పంచాయితీ గలగండ, జర్రిపడా గ్రామాల్లో శుక్రవారం కిలగాడ వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు.డ్రైనేజీల్లో పూడిక తీత చేయించి, బీచింగ్ జల్లించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గిరిజనులు జాగ్రత్తలు పాటించాలని, పరిసరాల మురుగునీరు, చెత్తాచెదారం లేకుండా చూడాలన్నాఱ. ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆరోగ్య విస్తరణ అధికారి కె.సుబ్రహ్మణ్యం, ఆప్తాలమిక్ అసిస్టెంట్ కిషోర్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ బాబూరావు, ఏఎన్ఎం పుష్పవతి, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ప్రమాదాల నివారణపై అవగాహన



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ మోహన్‌రావు

అరకులోయ రూరల్: మండలంలోని బొండం, రేగా గ్రామాల్లో ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ మోహన్‌రావు శుక్రవారం పర్యటించారు. రైల్వేమార్గంలో జరిగే ప్రమాదాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. రైల్లే లైన్‌ను ఆనుకొని ఉన్న గ్రామాల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు రైల్వే శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఈ మేరకు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తోందన్నారు. ట్రాక్‌ల పరిసరాలు చిన్నారులు వెళ్లకుండా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవలన్నారు, అందరూ అవగాహనతోనే రైల్వే మార్గంలో ప్రమాదాలు నిర్మూలన చేయగలమన్నారు. ఏఎస్ఐ అధికారి రమేష్, సర్పంచ్ భాస్కర్‌రావు, రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులకు అభినందనలు



పాంగి గణబాబు



కందుల బ్రహ్మాజీ



కట్టా సత్యనారాయణ



దామెర్ల రేవతి

చింతపల్లి రూరల్/దేవీపట్నం/ఎటపాక: అల్లూరి జిల్లా వైఎస్సార్‌సీపీ కమిటీ సభ్యులను అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా చింతపల్లి మండలానికి చెందిన పాంగి గణబాబు, ఎటపాక మండలానికి చెందిన దామెర్ల రేవతీలను జిల్లా కమిటీ కార్యదర్శులుగా, దేవీపట్నం మండలానికి చెందిన కందుల బ్రహ్మాజీ(బాబ్జి) జిల్లా ఉపాధ్యక్షుడిగా, కట్టా సత్యనారాయణను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పాడేరు, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నాగులపల్లి ధనలక్ష్మిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి పలువురు అభినందనలు తెలిపారు.

కాలిబాటల ఏర్పాటుతో తెగుళ్ల నివారణ



వరినాట్లు వేస్తున్న కూలీలు

కె.కోటపాడు: వరి సాగులో రైతులు కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే తెగుళ్లు నివారించవచ్చని భార్గవ్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ చైర్మన్ లాలం అచ్చింనాయుడు తెలిపారు. వారాడ క్లస్టర్ గ్రామాల్లో రైతులకు కాలిబాటల ఏర్పాటుతో వరినాట్లు వేయడం వల్ల కలిగే లాభాలను ఆయన వివరించారు. అడుగు మేర కాలిబాట ఏర్పాటు చేసుకోవాలని, పంటకు ఆశించే తెగుళ్ల ఉధృతిని తగ్గించవచ్చునని సూచించారు. గాలి, వెలుతురు, సూర్యరశ్మి తగలడం వల్ల పంట ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. మందుల పిచికారీకి సులువుగా ఉంటుందని సూచించారు.